క్లుప్తంగా

రీ-సర్వేతో రైతులకు మేలు



రీ-సర్వే వివరాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: రీ-సర్వే సక్రమంగా పూర్తయ్యేందుకు రైతులు అందుబాటులో ఉంటూ సహకరించాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. మండలంలోని నరేంద్రపురంలో రీ-సర్వే పరిశీలించారు. ఇంతవరకు ఎంతమేర సర్వే చేశారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రీ-సర్వేలో జరిగిన లోపాలను సవరించేందుకు ఈ కార్యక్రమం అందుబాటులోకి వచ్చిందన్నారు. రీ-సర్వే డీటీ పడాల్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పిచికారీ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. దోమల బెడద లేకుండా అవసరమయ్యే చర్యలు తీసుకుంటున్నామన్నారు. మునగపాక మెయిన్‌రోడ్డులో దోమల నివారణకు మందు పిచికారీ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల ముందు నీటి నిలువలు లేకుండా చూడాలని, కాలువలు శుభ్రం చేసే సమయంలో పారిశుధ్య కార్మికులకు సహకరించాలని కోరారు.

ఆడిటోరియం ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

మునగపాక: రూ.5 కోట్లతో నిర్మించనున్న ఆడిటోరియంకు అవసరమయ్యే స్థలాన్ని శుక్రవారం స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. మునగపాక ఇందిరమ్మ కాలనీతో పాటు దళితవాడను అనుకొన్న స్థలాన్ని పంచాయతీ రాజ్ డీఈ వీరభద్రరావు పరిశీలించారు. ఆడిటోరియం ఏర్పాటుకు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ముందుకొచ్చారని, అనువైన స్థలం పరిశీలన చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. అన్ని హంగులతో కూడిన ఆడిటోరియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురామ్, దాడి ముసిలినాయుడు, బొడ్డేడ అప్పలనాయుడు, వేగి కృష్ణ, విల్లూరి నూకసర సింగరావు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం



భోజనం పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండేలా చూడాలని తహసీల్దార్ ఎస్.ఆది మహేశ్వరరావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని హెచ్‌ఎం శ్రీనివాసరావును ఆదేశించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ -శ్రమ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



గొల్లలపాలెంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు పూర్ణిమాదేవి

మునగపాక: మండలంలోని గొల్లలపాలెంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఆర్.పూర్ణిమా దేవి శుక్రవారం సందర్శించారు. ఉపాధి హామీ పథకం పనులను ఆమె పరిశీలించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలన్నారు. బహిరంగ మల విసర్జనకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ -శ్రమ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్లస్టర్ ఏపీడీ మణికుమార్, ఏపీవో శివ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతన్నా.. జాగ్రత్తన్నా..

- రబీలో విస్తృతంగా క్రిమిసంహారక మందుల పిచికారీ
- వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి
- రక్షణ చర్యలు తప్పనిసరి



క్రిమిసంహారక మందును పిచికారీ చేస్తున్న రైతు

యలమంచిలి రూరల్: పొలాల్లో క్రిమిసంహారక మందులు పిచికారీ చేసే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణానికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే రైతులు అనారోగ్యం పాలవుతారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో సాగులో ఉన్న సాధారణ, ఉద్యాన పంటలతో పాటు కూరగాయలు, ఆకుకూరల పంటలకోసం రైతులు విస్తృతంగా క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తున్నారు. పంటలను చీడపీడల నుంచి రక్షించుకునే ప్రయత్నంలో రైతులు బిజీగా ఉన్నారు. ఈ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే ముప్పు తప్పించుకోవచ్చునని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఒక్కోసారి ఎంత అప్రమత్తంగా ఉన్నా రైతులు విష ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉంది. మూడు రకాలుగా క్రిమిసంహారక మందులు శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంది. చర్మం, ముక్కు, నోటి ద్వారా క్రిమిసంహారక మందులు మనుషుల శరీరంలోకి ప్రవేశించి దుష్ప్రభావం చూపుతాయి. చర్మం ద్వారా విష పదార్థాలు శరీరంలోకి ప్రవేశిస్తే వెంటనే సబ్బు, మంచినీటితో శుభ్రంగా కడగాలి. ఒకవేళ కళ్లలో పడితే మంచినీటితో కడగాలి. చికిత్స కోసం వెంటనే దగ్గర్లోని వైద్యుడ్ని సంప్రదించాలి. ముక్కుతో పీల్చితే విష ప్రభావానికి గురైన వ్యక్తిని గాలి, వెలుతురు బాగా వచ్చే ప్రదేశంలో ఉంచాలి. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటే వెంటనే కృత్రిమ శ్వాస అందించాలి. వీలైనంత త్వరగా వైద్యుని వద్దకు తీసుకెళ్లి చికిత్స అందించాలి. నోటి ద్వారా కడుపులోకి వెళ్లినపుడు వాంతి చేయించే మార్గాలను చూడాలి. ఉప్పునీటిని లేదా ఆవాల పొడిని తగిన మోతాదులో కలిపిన నీటిని తాగించడం ద్వారా కడుపు ఖాళీ అయ్యేలా చూస్తూ వైద్యుడి వద్దకు త్వరగా తీసుకెళ్లాలి. క్రిమి సంహారక మందుల పిచికారీలో తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి.

రక్షణ చర్యలు తీసుకోవాలి...

క్రిమిసంహారక మందుల పిచికారీ సమయంలో రక్షణ దుస్తులు ధరించడం తప్పనిసరి. కాళ్లు, చేతులు పూర్తిగా కప్పి ఉంచేలా చొక్కాలు, ప్యాంట్లు ధరించాలి. ముఖానికి మాస్కు లేదా రక్షణ వస్త్రం కట్టుకోవడం మంచిది. కళ్లకు అద్దాలు పెట్టుకోవడం మేలు. మందులు కలిపేటపుడు చేతులకు గ్లౌవ్స్ ధరించాలి. నీటిలో మందును వేసాక కర్రతో కలపడం మేలు.

ఇక్కడ అప్రమత్తంగా ఉండాలి

- ముందుగా డ్రమ్ముల్లో లేదా బకెట్లలో మందు కలుపుకున్న తర్వాతనే స్ప్రేయర్లలో నింపుకుని పిచికారీ చేయాలి. అనుభవం కలిగిన వ్యవసాయ, ఉద్యాన అధికారుల సూచనల మేరకే తగిన మోతాదులో మందులను వినియోగించాలి.
- రసాయన మందుల్ని ఇంట్లో పిల్లలకు దూరంగా భద్రపర్చాలి. పొలాల వద్ద ఉంచడం మేలు. ముందుగా మందు డబ్బాల మీద గడువు తేదీని గుర్తించాలి.
- మందు సీసాల మూతలను ఎట్టిపరిస్థితుల్లోనూ నోటితో తీయకూడదు. స్ప్రేయర్ నాజిల్‌కు ఏదైనా అడ్డుతగిలినట్లయితే నోటితో తీయడం ప్రమాదకరం.
- రెండు మూడు రకాల మందులను వాడేటప్పుడు అవి కలిసిపోయే తత్వాన్ని గమనించిన తర్వాతనే పిచికారీ చేయాలి.
- మందు పిచికారీ చేసేటపుడు ఆకులపైన, కింది భాగంలో తడిసేలా స్ప్రేయర్లు ఉపయోగించాలి.

జాగ్రత్తలు తప్పనిసరి



రైతులు క్రిమిసంహారక మందుల వినియోగంలో తగు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. తగు మోతాదులో మాత్రమే క్రిమిసంహారక మందులను వాడాలి. ఈ విషయంలో సమీపంలో వ్యవసాయాధికారి లేదా శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలి. కాలపరిమితి దాటిన క్రిమిసంహారక మందులను ఎట్టిపరిస్థితుల్లోనూ వినియోగించరాదు. గాలికి ఎదురుగా పిచికారీ చేయటం మంచిదికాదు. మందుల్లో ఉప్పు నీటిని వాడరాదు. ఉదజని సూచిక 8కి మించి ఉన్న, 5కి తక్కువ ఉన్న నీటిని వినియోగించరాదు.

పాలిమేర మోహన్‌రావు, ఏవో, యలమంచిలి

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కృషి



పెదరాంభద్రపురంలో తడి, పొడి చెత్త గురించి అవగాహన కల్పిస్తున్న ఈవోపీఆర్డీ చంద్రశేఖర్

పాయకరావుపేట: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ సిబ్బంది కృషి చేస్తున్నారని ఈవోపీఆర్డీ సిహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలో పెద రాంభద్రపురం, నామవరం, మంగవరం గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా ఎప్పటికప్పుడు వీధులు శుభ్రం చేయించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. చెత్త నుంచి సంపద కేంద్రాలను అభివృద్ధి చేసి, వర్మీ కంపోస్టు తయారు చేయాలన్నారు. తద్వారా అమ్మకాలు సాగించి, సచివాలయాలకు ఆదాయం సమకూర్చాలన్నారు. తడి, పొడి చెత్తను సేకరించి వాటిని ఏ విధంగా వర్మీ కంపోస్టు తయారు చేయాలో సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఇంటి పన్నులు వసూలు చురుగ్గా చేపట్టాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు దుర్గాప్రసాద్, కొండలరావు, ఆచారి, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి విజయ గౌరి విస్తృత ప్రచారం



కొత్తపేట పాఠశాలలో ప్రచారం చేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి విజయ గౌరి

యలమంచిలి రూరల్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి శుక్రవారం పట్టణంలో వివిధ స్కూళ్లు, కాలేజీల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులను తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. యూటీఎఫ్‌తో పాటు పలు ప్రజా సంఘాలు ఆమెకు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు.

విద్యా రంగం, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రొఫెసర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. ఏయే సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వబోతున్న విషయాన్ని ఓటర్లకు తెలియజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు జీఎస్ ప్రకాష్, యల్లయ్య బాబు, వెంకట్, రామకృష్ణ, రాణి, బాలాజీ, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కర్రి అప్పారావు, సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం బాలాజీ పాల్గొన్నారు.

6 గంటలకే పని ప్రదేశాలకు చేరుకోవాలి



కైలాసపట్నంలో ఉపాధి కూలీలకు సూచనలు ఇస్తున్న ఏపీవో నాగరాజు

కోటవురట్ల: ఉపాధి కూలీలు ఉదయం 6 గంటలకే పని ప్రదేశాలకు చేరుకోవాలని ఏపీవో నాగరాజు సూచించారు. కైలాసపట్నం రెవెన్యూ పరిధిలో ఉపాధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. కందకం పనులు పరిశీలించి వారికి సూచనలు చేశారు. ఏపీవో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేయడం ద్వారా వేతనం ఎక్కువగా పొందే అవకాశం ఉంటుందన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని కూలీలు తొందరగా పనులు ప్రారంభించాలన్నారు. వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ 50 మంది కూలీలకు ఒక మేట్ బాధ్యత వహించి వారి పనిలో సహాయకారిగా ఉంటూ సక్రమంగా పని చేయించాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్.జ్యోతి, మేట్లు పాల్గొన్నారు.

వైభవంగా అడవిరాజుల పండగ



యండపల్లిలో అడవిరాజుల ఆలయం వద్ద భక్తులు



పాములవాకలో మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

కోటవురట్ల: మండలంలోని పలు గ్రామాల్లో అడవి రాజుల పండగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లెల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. బంధుమిత్రుల రాకతో పల్లెలు సందడి చేశాయి. భారీ ఊరేగింపులు, డప్పు వాయిద్యాలతో రహదారులు కోలాహలంగా మారాయి. పాములవాకలో పండుగను వైభవంగా నిర్వహించారు. గ్రామ శివారున అడవిరాజుల ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. యండపల్లిలో పండుగ సందర్భంగా గ్రామ శివారున ఆలయానికి భక్తులు చేరుకుని పూజలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అచ్యుతాపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెదురువాడ, గొర్లి ధర్మవరం, లంక ధర్మవరం, మెట్ట ధర్మవరం, మోసయ్యపేట బర్మా కాలనీ ఏరియా, అచ్యుతాపురం ఇందిరమ్మ కాలనీ ఏరియా, ఆర్ అండ్ ఆర్ కాలనీ, దిబ్బపాలెం, వెంకటాపురం సెంటర్, మార్టూరు రోడ్, అచ్యుతాపురం సెంటర్, సాయి ప్రియా లే-అవుట్ గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



తోటాడలో దుర్గాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండలంలోని తోటాడలో దుర్గాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు. పలువురు భక్తులు మొక్కులు చెల్లించుచుకున్నారు.

వాహన పార్కింగ్ షెడ్‌కు మోక్షం



మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా పార్కింగ్ షెడ్ పనులు

మునగపాక: ఎట్టకేలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ అధికారులకు సంబంధించిన వాహన పార్కింగ్ స్టాండ్‌కు మోక్షం కలిగింది. 2014 అక్టోబర్ 12న సంభవించిన హుద్‌హుద్ తుఫాన్ సమయంలో వీచిన ఈదురుగాలులకు ఇక్కడ షెడ్ ఎగిరిపోయింది. దీంతో వాహనాలు నిలుపుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సంబంధిత వాహనాలు ఎండకు ఎండి వర్షాలకు తడుస్తూ పాడయ్యేవి. దీంతో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఎంపీడీవో ఎం.ఉషారాణి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పార్కింగ్ షెడ్ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. షెడ్ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. దీంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ఇబ్బందులు

అచ్యుతాపురం రూరల్: ఎప్పటికప్పుడు వివిధ కారణాలతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వేసవి ఆరంభంలోనే విద్యుత్ కోతలు తారాస్థాయిలో ఉన్నాయంటే, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఏ విధంగా ఉంటాయో ఊహించలేని పరిస్థితి నెలకొంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం పరిసర ప్రాంతాల్లో ఎక్కువ శాతం వ్యాపారాలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో వ్యాపారులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. గృహాల్లో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. సరైన సమయంలో రోగులు వైద్య చికిత్సలు పొందలేక అవస్థలు పడుతున్నారు. ప్రతి నెలా బిల్లులు కడుతున్న సామాన్యులను దృష్టిలో పెట్టుకుని అంతరాయం కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

'మున్సిపాలిటీలో అక్రమాలపై విచారణ చేయాలి'

నర్సీపట్నం: మున్సిపాలిటీలో అక్రమాలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నేతల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో డ్రైవింగ్ రాని 13 మందికి జీతాలు చెల్లిస్తున్నారని, వీరిలో ఇద్దరే డ్రైవర్లని తెలిపారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

దేశం గర్వించదగ్గ నేత దామోదరం



సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: మాజీ సీఎం దామోదరం సంజీవయ్య ఎంతో దూరదృష్టితో ఆలోచించి పేదలు మనుగడ సాగించే పథకాలు అమలు చేశారని ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు తెలిపారు. ధర్మవరం అగ్రహారం పాఠశాలలో శుక్రవారం సంజీవయ్య జయంతి నిర్వహించారు. అప్పట్లో 6 లక్షల ఎకరాలు పేదవారికి పంపిణీ చేసి, మొట్టమొదటిగా వృద్ధాప్య పింఛన్ అమలు చేసి దేశం గర్వించదగ్గ నేతగా కీర్తి పొందారని కొనియాడారు. రాజకీయాల్లో కొందరు శాశ్వత ప్రయోజనం చేసే పనులు చేస్తారని, వాటిని ప్రతి ఒక్కరూ తెలుసుకుని భవిష్యత్ తరాల వారికి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గార ప్రకాష్, కుమారి, ఆర్. అప్పలనాయుడు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు న్యాయం చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న బొడ్డేడ ప్రసాద్

అచ్యుతాపురం రూరల్: జగ్గన్నపేటలో విద్యుదాఘాతానికి నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలంటూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. జగ్గన్నపేటలో ఇటీవల విద్యుత్ తీగల నుంచి వ్యాపించిన మంటల్లో నాలుగు వరి కుప్పలు, ట్రాక్టర్ కాలి బూడిదైన విషయం విదితమే. విషయం తెలుసుకున్న ప్రసాద్ శుక్రవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దొడ్డి వెంకటకృష్ణ, రైతు మళ్ల రాము, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ



స్పోర్ట్ కిట్స్‌తో విద్యార్థులు, పక్కన ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలని ఉద్దేశంతో నాంది ఫౌండేషన్ వారు క్రీడా సామగ్రి అందజేశారని ప్రధానోపాధ్యాయుడు ఎస్.సత్యనారాయణ తెలిపారు. కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో 6 నుంచి 9 తరగతుల బాలికలకు స్పోర్ట్ కిట్స్ అందజేశారు. ఒక్కొక్కటి రూ.3 వేలకుపైగా విలువ ఉంటుందని, క్రీడా సామగ్రితో ఆటల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. నాంది ఫౌండేషన్ స్పోర్ట్స్ టీచర్ డి. వీణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగిస్తుంటే..
కూటమి నేతలకు కోపమొచ్చింది

- ఆక్రమణలను తొలగించేందుకు వెళ్లిన అధికారులు
- ప్రజాప్రతినిధుల ఒత్తిడితో తూతూ మంత్రంగా చర్యలు
- తొలగింపుల్ని అడ్డుకున్న కూటమి 'ముఖ్యనేతలు'



కార్మికనగర్‌లో ఆక్రమణలను తొలగించే సమయంలో కూటమి నాయకుల బెదిరింపులతో ఆగిన అధికారులు



చీమలాపల్లిలో షెడ్ తొలగించేందుకు వెళ్లిన అధికారులను అడ్డుకున్న దృశ్యం

పెందుర్తి: అది చెరువు.. మరొకటి ప్రభుత్వ భూమి.. అందులో ఇష్టానుసారంగా కూటమి నాయకులు స్థలాలను ఆక్రమించి అమ్మకాలు జరుపుతున్నారు. ఆ దురాక్రమణ పర్వాన్ని అడ్డుకునేందుకు అధికారులు కదిలారు. కానీ వారికి 'కూటమి ముఖ్యనేతలు' బంధనాలు వేశారు. ఆ ఆక్రమణలను తొలగిస్తే మీ సంగతి చూస్తామంటూ.. అధికారులనే అడ్డుకున్నారు.

కదిలి.. వెనక్కి మళ్లిన యంత్రాంగం

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పెందుర్తి పట్టణ ప్రాంతంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు పెరిగిపోయాయి. చెరువులు, గెడ్డలు, ప్రభుత్వ స్థలాల్లో కూటమి నాయకులు కబ్జాలకు పాల్పడుతూ.. ఆయా స్థలాలను పేద, మధ్య తరగతి కుటుంబాలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై 'పాక వెయ్..అమ్మేసెయ్' శీర్షికన సాక్షి కథనాన్ని ప్రచురించింది. ఈ కథనంపై స్పందించిన తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ ఆదేశాలతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దివ్య బృందం ఆక్రమణల తొలగింపునకు వెళ్లింది. కార్మికనగర్‌లో అక్రమంగా వేసిన పాకలను తొలగించారు. అయితే మిగిలిన చోట కొందరు ప్రజాప్రతినిధులు ఒత్తిడి చేయడంతో వెనుదిరిగినట్లు తీవ్రస్థాయిలో ఆరోపణలు వచ్చాయి.

కంచే చేను మేస్తే..

పెందుర్తి పట్టణ ప్రాంతంలో చెరువులు, ప్రభుత్వ భూములను 'కంచే చేను మేస్తున్న' చందంగా కూటమి నాయకులే మింగేస్తున్నారు. ఆక్రమణలను తొలగించేందుకు వెళుతున్న అధికారులను బెదిరిస్తూ భూ కబ్జాదారులకు అండగా నిలుస్తున్నారు. శుక్రవారం ఆక్రమణలను తొలగించేందుకు వెళ్లిన అధికారులకు చుక్కెదురైంది. చినముషిడివాడ కార్మికనగర్, చీమలాపల్లిలోని చెరువు, ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులను కూటమి నాయకులు అడ్డుకున్నారు. ముఖ్యంగా స్థానిక జనసేన, టీడీపీ నాయకులు వారి ముఖ్య నేతలతో ఫోన్లు చేయించి మరీ, తొలగింపుల్ని నిలిపేయించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షకులుగా పదే పదే చెప్పుకునే ప్రజాప్రతినిధులే ప్రభుత్వ భూముల ఆక్రమణలను ప్రోత్సహిస్తుంటే చేసేదేం లేక రెవెన్యూ అధికారులు వెనుదిరిగాల్సి వచ్చింది.

జూదరులపై కేసు నమోదు

అనకాపల్లి: మండలంలో గోపాలపురం గ్రామం శివారులో జూదమాడుతున్న ఇద్దరిని అదుపులోనికి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.1820 స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ రవికుమార్ శుక్రవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేశామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.